

కాచాపూర్‌లో నిత్యావసర సరుకుల అందజేత



భిక్కనూరు, ఏప్రిల్ 18: మండలంలోని కాచాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి గురువారం అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో మున్ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.





రైస్‌మిల్లుల్లో గుట్టలుగా పేరుకపోయిన ధాన్యం నిల్వలు

ధాన్యాన్ని దాచేదెక్కడ!?

- జిల్లాలో రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలకు చోటు కరువు
- గత యాసంగి, వానాకాలం సీజన్‌ల సీఎంఆర్ ధాన్యం మిల్లుల్లోనే..
- యాసంగి ధాన్యం వేలం వేసినా దక్కించుకున్న వారు లిఫ్ట్ చేయలేదు
- సరిపడా గోదాంలు లేక ఎదురవుతున్న సమస్య
- ఈ సీజన్‌లో కొనుగోలు చేసే ధాన్యాన్ని ఎక్కడ దింపుకోవాలంటున్న మిల్లర్లు
- ఇప్పటికే ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు
- 4.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం

కామారెడ్డి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైస్‌మిల్లుల్లో గత యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. సీఎంఆర్ ధాన్యం, రైస్ మిల్లుల్లో, గోదాంల్లో ఎక్కడికక్కడే నిల్వలు అలాగే ఉండిపోయాయి. రాష్ట్ర గిడ్డంగులు, ఎఫ్‌సీఐ గోదాంలు ఖాళీ కాకపోవడంతో మిల్లుల్లో కస్టం మిల్లింగ్ ధాన్యం సంచుల నిల్వలు అలాగే ఉండిపోవడంతో ఈ యాసంగి సీజన్ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు మిల్లుల్లో చోటు లేకుండా పోతోంది. అయితే గత యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని ప్రభుత్వం వేలంపాట నిర్వహించగా ఆ ధాన్యాన్ని దక్కించుకున్న వారు లిఫ్ట్ చేయడం లేదు. దీంతో మిల్లుల్లో ధాన్యం పేరుకుపోయింది. ఈ సీజన్‌లో కొనుగోలు చేసే ధాన్యాన్ని ఎక్కడ దింపుకోవాలంటూ మిల్లర్లు సైతం తర్జనభర్జన పడుతున్నారు. ఇదే విషయాన్ని మిల్లర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో వ్యాగన్లు రాక మిల్లుల్లో, గోదాంలో గత సీజన్‌లకు సంబంధించి ధాన్యం అలాగే ఉండడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయి. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యాన్ని తరలించే అవకాశం ఉంది.

జిల్లాలో 200లకు పైగా రైస్‌మిల్లులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 200లకు పైగా రైస్ మి ల్లు లు ఉన్నాయి. ఇందులో 135 రా రైస్‌మిల్లులు ఉండగా 35 పైగా బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు కేటాయిస్తోంది. ఈ మిల్లులో ఇప్పటికే గత వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి ధాన్యం నిల్వలు అలాగే ఉండిపోయాయి. మరోవైపు గోదాంలు కూడా ఖాళీగా లేవు. జిల్లాలో రెండు చోట్ల మాత్రమే ఎఫ్‌సీఐ గోదాంలు ఉన్నాయి. ఈ గోదాంల్లో సైతం సీఎంఆర్ నిల్వలు పేరుకుపోయాయి. ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో వ్యాగన్లు రాకపోవడంతో ఈ గోదాంలలో నిల్వలు ఖాళీ కావడం లేదని సంబంధితశాఖధికారులు చెబుతున్నారు.

వేలం పాటలో దక్కించుకున్న ధాన్యాన్ని లిఫ్ట్ చేయని వ్యాపారులు

జిల్లాలో గత యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించింది కూడా ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలుచేసి మిల్లులకు కేటాయించారు. అయితే ఇందులో కొంతమేర మిల్లర్లు సీఎం రైస్‌ను ప్రభుత్వానికి అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో మిల్లుల్లో ఉన్న ధాన్యానికి వేలం వేసింది. ఈ వేలం పాటలో కొందరు వ్యాపారులు పాల్గొని ధాన్యాన్ని దక్కించుకున్నారు. అయితే దక్కించుకున్న వ్యాపారులు మిల్లుల నుంచి ధాన్యాన్ని లిఫ్ట్ చేయడం లేదు. ఆ సీజన్‌కు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోతోంది. ఇక 2023-24 వానాకాలంకు సంబంధించి రైతుల నుంచి 4.44లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించారు. ఇందుకు గాను మిల్లర్లు 2.99 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. ఇందులో 8 శాతం ప్రభుత్వానికి మిల్లర్లు అప్పగించారు. ఈ సీజన్ ధాన్యం కూడా మిల్లుల్లోనే ఉండిపోయింది.

ఖాళీగా లేని గోదాంలు

జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాంతో పాటు సాధారణ గోదాంలు సుమారు 35కు పైగానే ఉన్నాయి. ఈ గోదాంలో ఎఫ్‌సీఐ సంస్థయే అధిక కెపాసిటీ గల ధాన్యం నిల్వలే ఉంటాయి. జిల్లాలోని కామారెడ్డి శివారులోని గత కలెక్టరేట్ సమీపంలో 15వేల మెట్రిక్ టన్నుల, నర్సన్నపల్లి వద్ద 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎఫ్‌సీఐ గోదాంలు మాత్రమే ఉన్నాయి. వీటితో పాటు బాన్సువాడలో ఎఫ్‌సీఐ గోదాంలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే సీఎంఆర్ బియ్యం నిల్వలతో నిండిపోయాయి. ఇక మిగితా గోదాంలు ఎరువుల నిల్వలతో నిండిపోయాయి. కామారెడ్డిలోని 4 ఎఫ్‌సీఐ గోదాంలు గత కొన్నిరోజుల నుంచి ఖాళీగా లేవు. ఈ గోదాంలోని సీఎంఆర్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొన్ని రోజులుగా వ్యాగన్లు రాక అలాగే ఉండిపోతున్నాయి.

4.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం

యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో 5.85 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ లెక్కన కొనుగోలు కేంద్రాలకు 4.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు తరలించే అవకాశం ఉంది. కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 347 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 191 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 43,672 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6902 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించడంపై అధికారులు మిల్లర్లు తర్జనభర్జన పడుతున్నారు. మిల్లుల్లో ధాన్యాన్ని దింపుకునేందుకు చోటు లేకపోవడం, గోదాంలుఖాళీ లేకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడ దాచేదనే దానిపై సందిగ్ధత నెలకొంటుంది.

తరుగు పేరుతో రైతులకు నష్టం జరగకుండా కృషి చేస్తాం

జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి



తాండూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కోదండరెడ్డి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 18 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ఎక్కువ తూకం వేయడం వల్ల రైతులకు కొంత మేర నష్టం జరుగుతుందని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టం జరగకుండా కృషి చేస్తామని జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. ఆయన గురువారం నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండూరు కొనుగోలు కేంద్రంలో తరుగు పేరుతో 40 కిలోల బస్తా ఒక్కంటికి గాను 42 కిలోల 200 గ్రాముల వరి ధాన్యాన్ని తూకం వేసి రైతుల నుంచి తీసుకుంటున్నారని, ఖాళీ సంచి బరువు పోను ఒక క్వింటాల్‌కు 4 కిలోల తరుగు పేరుతో అధికంగా తీసుకుంటున్నారని దీంతో రైతులకు నష్టం కలుగుతుందని ఆయన తెలిపారు. తాండూరుతో పాటు ఇతర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ తరుగు పేరుతో ఎక్కువ తూకం వేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తరుగు పేరుతో ఎక్కువ తూకం వేయకుండా రైతులకు నష్టం జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే సంబంధిత రైతుకు అధికారపరంగా తగిన రసీదును ఇవ్వాలని, కాని చీటిపైన రాసి ఇస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేసే వరకే రైతుల బాధ్యత ఉంటుందని, ఆపైన కొనుగోలు కేంద్రం సిబ్బంది, అధికారులే పూర్తి బాధ్యత వహించి రైతుల ఖాతాలో సకాలంలో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సమస్యలు ఏమైనా ఉంటే వాటిని తెలుసుకోవడానికి వాటిని పరిష్కరించేందుకు తాము క్షేత్ర స్థాయిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పార్ట్(బి)లో పెండింగ్‌లో ఉంచిన రైతుల సమస్యలను జూన్ 4 వరకు తమ ప్రభుత్వం పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో సుమారు 18 లక్షల ఎకరాలు, రెండు లక్షల 45 వేల దరఖాస్తులు పరిష్కారం కాక నిషేధిత జాబితాలో పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షానా ఉంటున్నదని, రైతులు సమస్యలు పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, తాండూరు సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, బోయిని విఠల్, వాసురెడ్డి, కిష్టయ్య, సంగయ్య, ప్రభాకర్, అహేమద్, సంజీవులు, గోపాల్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాన్సువాడ టౌన్/ఎల్లారెడ్డి, ఏప్రిల్ 18: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మండల విద్యాధికారికి సూచించారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని పోలీస్‌లైన్, ఎస్సీవాడ పాఠశాలలను, ఎల్లారెడ్డిలోని పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లో గల సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే పనులు పూర్తి చేసుకోవాలని, అందుకోసం నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు , ఇంజనీరు గజేందర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గాంధారి: మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ పాఠశాలను గురువారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మంచి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపిక

లింగంపేట: మండలంలోని లింగంపల్లి ఖుర్దు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన గురువారం లింగంపల్లి ఖుర్దు పాఠశాలలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మంజూరైన మౌలిక వసతుల కల్పనపై డీఈ, ఏఈలకు ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలకు మంజూరైన పనులను జూన్ 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ పనులను గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్‌తో పాటు అధికారులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నామినేషన్ల ప్రక్రియ షురూ

సంగారెడ్డి టౌన్/కామారెడ్డి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియకు గురువారం ప్రారంభమైంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున ఆయన అనుచరులు ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ నాయకులు సాగర్‌తో పాటు నలుగురు కార్యకర్తలు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

నామినేషన్ పత్రాలకు పూజలు

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ నామినేషన్ పత్రాలకు ఆయన కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ గురువారం పూజలు నిర్వహించారు. ఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో స్వామి వారి ఎదుట ఉంచి వేద పండితులతో అర్చన చేయించారు. ఈ సందర్భంగా నాయకులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు కాశీనాథ్ పటేల్ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, ముత్యం హన్మండ్లు, శివ్‌లింగ్‌పటేల్, నాయకులు సురేష్, శివ,పాండు, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద భారీ భద్రత

తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి : నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కాగా, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయమైన సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో బారికేడ్లు పెట్టి మూసివేశారు. కలెక్టరేట్ నుంచి సంగారెడ్డిలోకి వెళ్లే దారిలో 500 మీటర్ల దూరంలో బారికేడ్లను పెట్టేశారు. ఇక కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే సాధారణ ప్రజలను రానీయడం లేదు. మీడియా ప్రతినిధులను కలెక్టరేట్ ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేసిన షామియానా వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. కనీసం డీపీఆర్వో కార్యాలయంలోకి వెళ్లనీయడం లేదు. కలెక్టరేట్‌లో కార్యాలయాలున్నా జిల్లా స్థాయి అధికారుల వాహనాలను కూడా లోపలికి అనుమతించకపోవడం గమనార్హం. జిల్లాస్థాయి అధికారులు కూడా పోలీసులకు తమ గుర్తింపు కార్డులను చూపించి కలెక్టరేట్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. నిబంధన ప్రకారం కలెక్టరేట్‌లోకి నామినేషన్లు వేసే అభ్యర్థితో పాటు ఐదుగురిని లోపలికి అనుమతిస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఎన్నికలు జరుగుతున్నా ఇలాంటి భద్రతా చర్యలు మునుపెన్నడూ కనిపించలేదని పలువురు అధికారులే అంటున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంగా కొనసాగిన సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ మెదక్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా, జాయింట్ కలెక్టర్ జహీరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఆ సమయంలోనూ ఇంతటి అసాధారణ భద్రతా చర్యలు లేవని, అయినా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగిందని జిల్లా స్థాయి అధికారి ఒకరు గుర్తుచేశారు.



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద భారీ సంఖ్యలో బలగాలు

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తర్వాత ఆగస్టు మాసంలో కాంగ్రెస్ పార్టీ రుణమాఫీని అందిస్తుందని తెలిపారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల డాటా మా వద్ద ఉందని ఎన్నికలు రాగానే వారి అకౌంట్లలో డబ్బులు వేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకు కల్పించలేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే పాంచ్ న్యాయ్ 25గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. యువన్యాయ్, నారిన్యాయ్, కిసాన్‌న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారిన్యాయ్‌లపై దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ మాట్లాడుతూ బీజేపీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదని, పెట్రోల్ లీటర్‌కు రూ.35 ఇస్తామని ఇవ్వలేదని, మహిళల రక్షణ ఇంకా భద్రత కల్పిస్తామని కల్పించలేదని అన్నారు. నల్లధనాన్ని వెనక్కి రప్పించడం, విఫలమైందని, అదానీ అంబానీ లాంటి క్రోని క్యాపిటలిస్టులను పెంచి పోషించిందని తెలిపారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ నిమ్మ మోహన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ జడ్పీటీసీ నిమ్మ మోహన్‌రెడ్డి

రేపు కార్యకర్తల సన్నాహక సమావేశం

● బీజేపీ ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 18: ఈనెల 20న ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని బీజేపీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కార్యకర్తల సన్నాహక సమావేశం ఉంటుందని, సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి నరేష్, వీకే సీనియర్ నాయకులు బాల్‌రాజ్, బాలకిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుంది'

బోధన్‌రూరల్,ఏప్రిల్18: నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుందని, నేత్రదానం అన్ని దానాల కంటే గొప్పదని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో బొడ్డు వెంకటేశ్వర్ రెడ్డి(90)అనే వ్యక్తి మృతి చెందగా లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ద్వారా నేత్రదానం హైదరాబాద్‌లో ఎల్‌వీ ప్రసాద్‌కు పంపారు. అవయవదానం కోసం పార్థిక దేహన్ని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, కాలనీవాసులు నివాళులు అర్పించారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

● గురువారం ఆచన్‌పల్లికి చెందిన మెట్ట నాగ అంజమ్మ మరణ అనంతరం వారి నేత్రాల దానం వల్ల ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు నివాళులు అర్పించారు. నేత్రదానం అన్నింటికి కంటే గొప్పదని పేర్కొన్నారు.

సేవ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్18: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిచౌరస్తాలో రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు ఖాందేశ్ శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారుల దాహర్తిని తీర్చడం కోసం తమవంతు కృషి చేయాలని ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధానకార్యదర్శి విద్యాప్రవీన్ పవార్, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, విద్యగోపి, బేతు గంగాధర్, పట్వారి తులసీ, ఖాందేశ్ సత్యం, మీర శ్రావణ్, మక్కల సాయినాథ్, షహీద్, నరేందర్, సురేష్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఆలయ అభివృద్ధి కమిటీ



ఎన్నికైన ప్యాట్ల హన్మాన్ మందిర కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్18: పట్టణంలోని ప్యాట్ల హన్మాన్ మందిర కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా నగేష్‌శర్మ, పోలసుధాకర్, అధ్యక్షులుగా దొండి శ్యామ్ మనోహర్, ప్రధానకార్యదర్శి పుప్పాల సతీష్, కోశాధికారి బండారి నరేందర్, ఉపాధ్యక్షులుగా ద్యాగ శ్రీనివాస్, దొండి దేవేందర్, దస్‌పాల్ విజయ్‌కుమార్, కార్యదర్శులుగా కౌటికె విజయ్‌కుమార్, రుద్రవేణి అశోక్, కోల రాజు, సలహదారులుగా ద్యాగ ఉదయ్, బోంపల్లి బాపురాజ్, కోల మధుకర్, ద్యాగ శ్రీనివాస్, పుప్పాల గిరిధర్, వైద్యరవీందర్, డి.స్వామిరాజులను ఎన్నుకోగా వారని పలువురు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు.

కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ కలీం

రెంజల్,ఏప్రిల్18: మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం తహసీల్దార్ కలీం పరిశీలించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనేందుకు సమయాత్తం అవుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు. మహారాష్ట్ర-తెలంగాణలో ఉన్న చెక్‌పోస్టును రెవెన్యూ, పోలీసు శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి వద్ద పోలీస్‌చెక్‌పోస్టు గురువారం తిరిగి ప్రారంభమయింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌అమలు అయిన తరువాత మార్చి 17న కమ్మర్‌పల్లి శివారులోని బ్రహ్మగారి గుట్టవద్ద పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ఏసీపీ గట్టు బస్వారెడ్డి సందర్శించి పరిశీలించి వాహనాల తనిఖీ బృందం సిబ్బందికి పలుసూచనలు చేశారు. అయితే ఏప్రిల్ 3న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు చెక్‌పోస్టును ఎత్తివేశారు. తిరిగి ఆదేశాలు రావడంతో గురువారం చెక్‌పోస్టును తిరిగి ప్రారంభించి జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీలు చేపట్టారు. గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్, స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి డబ్బులు తరలిస్తే వాటికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుందని లేని పక్షంలో రూ.50లకు మించి తరలించే డబ్బులు సీజ్‌చేయడంతోపాటు సదరువ్యక్తిపై కేసునమోదు అవుతోందని ఎస్.ఐ రాజశేఖర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు 200రోజులు పని కల్పించాలి

మోర్తాడ్, ఏప్రిల్18: ఉపాధి హామీ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 200రోజులు పని కల్పించి రోజువారి కూలీ పెంచాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ అన్నారు. జిల్లా కార్యదర్శి జి.కిషన్ డిమాండ్ చేశారు. గురువారం మండంలోని దొన్కల్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ కూలీలకి జాబ్‌కార్డు ఇవ్వాలని, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యవసర ధరల అనుగుణంగా రోజువారి కూలీ కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు రూ.600 చొప్పున కూలీల ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు, మెట్లకు జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.అశోక్, మహిళ సంఘం నాయకురాలు సత్తెక్క, కూలీలు పాల్గొన్నారు.



దొన్కల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నగరంలో నెంబర్ ప్లేట్ లేని బర్గ్‌మెన్ వాహనాలు

- రాజధాని బైకులు నగరంలో..
- అక్కడ కొనుగోలు .. ఇక్కడ వినియోగాలు
- నెంబరు ప్లేట్ లేకుండానే యథేచ్ఛగా సంచారం
- పట్టించుకోని పోలీసులు

ఖిల్లా, ఏప్రిల్ 18 :రాజధాని హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం నగరంలో విచ్చలవిడిగా నడుస్తున్నాయి. నంబరు ప్లేటు లేకుండానే వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్న పోలీసులు మాత్రం వాటిని పట్టించుకున్న పాపన పోలేదు. ఇటీవల వాహనాల దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు నగరంలో జరుగుతున్నా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తూన్నపట్టికి ఓ ప్రాంతంలో విచ్చలవిడిగా వందల సంఖ్య లో బర్గ్‌మెన్ ద్విచక్రవాహనాలను నడుస్తున్న పోలీసులు మాత్రం వాటిని పట్టుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● జరుగుతుందిలా

హైదరాబాద్ కేంద్రంగా సుజీకి కంపెనీ తయారు చేసిన బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం కొత్త హంగులతో రూపొందించి మార్కెట్‌లో విడుదల చేశారు. వినియోగదారులు వాహనం సౌకర్యంగా ఉండడంతో వాటిని కొనుగోలు చేయడానికి ఉత్సాహపడుతున్నారు. వినియోగదారుల డిమాండ్‌ను బట్టి ఆ వాహనానికి వివిధ ఫైనాన్స్ కంపెనీలు రుణసదుపాయాలను కల్పిస్తుంది. అయితే వాటిని మాత్రం హైదరాబాద్ చిరునామ ఉన్న ఆధార్‌కార్డుతో తక్కువ డౌన్‌పేమెంట్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. దానిపై రుణం ఉండడంతో దానికి నంబరు కావలంటే వాహనంకు సంబంధించి పూర్తి రుణం చెల్లించిన అనంతరం నంబర్ రాసుకునే అవకాశం ఉంటుంది. దాని ఆర్‌సి సైతం రుణం ఇచ్చిన వారి వద్దనే ఉంటుంది. అటువంటి వాహనాలను నగరానికి చెందిన కొందరు వాటిని ఇక్కడకు తీసుకొచ్చి కేవలం రూ.30వేలు, 40వేలకు ఇచ్చివేస్తున్నారు. అసలు దాని ధర రూ.1లక్ష30వేలు ఉండగా తక్కువకు



నగరంలో బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం

ఇవ్వడంతో నగరానికి చెందిన కొందరు యువకులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వాహనాలను ఇక్కడ దర్జాగ వినియోగిస్తున్నారు. అటువంటి వాహనాలకు రుణాలు ఇచ్చిన ఫైనాన్స్ కెంపెనీల ఏజెంట్లు మాత్రం ఆధార్‌కార్డు ఆధారంగా సదరు ఇంటికి వెళ్లి వాహనం గురించి విచారణ చేయగా అక్కడ సదరు వ్యక్తులు ఎవరు ఉండక పోవడంతో వారు ఆ వాహనం కోసం హైదరాబాద్ ప్రాంతంలోనే తిరుగుతున్నారు. కాని నగరానికి వచ్చి మాత్రం వాహనాల గురించి విచారించకపోవడంతో వీటి వినియోగంతోపాటు అమ్మకలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. వీటిని ఒకే వర్గానికి చెందిన యువకులు మాత్రం కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో పోలీసు వాహనాల తనిఖీలు ఎక్కువగా ఉండకపోవడంతో యువకులు వాటిని యదేచ్చగా వాడుతున్నట్లు తెలిసింది.

● గతంలో ఇదే తరహాలో కార్లు దిగుమతి

గతంలో నగరానికి చెందిన కొందరు వ్యక్తులు పూణే, ఇండోర్ ప్రాంతాల నుంచి విలువైన పార్చునర్, ఇన్నోవా లాంటి కార్లను అడ్డదారుల్లో తీసుకొచ్చి వాటిని అతి తక్కువ ధరలకు అమ్మడం చేసే వారు. రూ.30-35లక్షలు ఉన్న పార్చునర్ కారును కేవలం 12-15లక్షలకు అమ్మెవారు. అమ్మెవారు మాత్రం జిల్లాకు చెంది విదేశాల్లో ఉండే వారికి మాత్రమే అమ్మేవారు. ఇలా చేయడం ద్వారా వారు ఇక్కడికి సెలవుపై వచ్చి వాటిని వినియోగించి తిరిగి వాటిని ఇండ్ల ఎదుట ఉంచి పోవడం జరుగుతుందనే భరోసాతో అటువంటి వాహనాలను విదేశాల్లో ఉపాధి పొందే వారికి మాత్రమే అమ్మి సొమ్ము చేసుకునేవారు.

● ఎలా తెచ్చే వారంటే

ఇతర రాష్ట్రాల్లో రుణాలు చెల్లించని వాహనాలను అక్కడి వ్యక్తులతో పరిచయాలు పెంచుకని వాటిని అడ్డదారిన తీసుకొచ్చే వారు. ఇతంతంగా చాల రోజులు జరిగింది. అనంతరం అప్పటి పోలీసుల దృష్టిలో రాగానే వాటి గుట్టు రట్టు చేసి నిందితులను సైతం పట్టుకున్న దాఖలాలు ఉన్నాయి. అనంతరం ఈ వ్యవహారం నడిపే వారు పోలీసులకు తెలిసి పోవడంతో వాటి జోళికి వెళ్లడం మానివేశారు. ప్రస్తుతం అదే తరహాలో కార్లకు బదులు ద్విచక్రవాహనాలను కొందరు యువకులు హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి వాటిని తక్కువ ధరలకు అమ్మడం వ్యాపారంగా చేసుకున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆ దిశగా దృష్టి పెట్టి వాటి గుట్టు రట్టు చేస్తారని వేచి చూస్తాం.

లారీ బైక్ ఢీకొని యువకుడి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్18: మండలంలోని జక్రాన్‌పల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయరహదారిపై గురువారం లారీ, బైక్ ఢీకొని నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహవీర్‌తండాకు చెందిన జాదవ్ సుధాకర్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మృతుని భార్య శిరీషకు తీవ్రగాయాలు కాగా పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహవీర్ తండాకు చెందిన జాదవ్ సుధాకర్ ఇతని భార్య శిరీష కలిసి బైక్‌పై నిర్మల్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి మీదుగా మృతుని అత్తగారి గ్రామమైన గాంధారి మండలం వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా జక్రాన్‌పల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయరహదారిపై లారీ చెడిపోయి రోడ్డుపై ఆగి ఉండగా వెనుక నుంచి వచ్చి బైక్‌ను లారీ ఢీకొందని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో జాదవ్ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. భార్య శిరీషకు తీవ్రగాయాలు కాగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుందని, ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉందన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాదవ్ సుధాకర్

మహిళ హత్య కేసులో నేరస్తుడి అరెస్టు

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 18: ఆర్మూర్ పట్టణంలోని సంతోష్ నగర్ కాలనీలో జరిగిన హత్య కేసులో జిల్లా కేంద్రంలోని నాగారం బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అల్లపు మల్లయ్య అనే నేరస్తుడిని గురువారం అరెస్టు చేసినట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏడేళ్ల క్రితం మృతురాలి ఇంట్లో కిరాయి ఉన్న మల్లయ్య తరచూ వారి ఇంటికి వస్తూ పోతుంటాడు. మార్చి 23న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటరిగా ఉన్న రాసూరి లాస్యను కొడవళితో హతమార్చి సుమారు 71 గ్రాముల వెండి, 25 గ్రాముల బంగారాన్ని దొంగిలించకుని వెళ్లాడు. సీసీ కెమెరాల ఆధారాలతో పాత నేరస్తుల రికార్డుల ఆధారంగా పోలీసులు నిందితున్ని తన ఇంటివద్ద పట్టుకుని విచారంచగా హత్య నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితున్ని అదుపులోనికి తీసుకుని ఎత్తుకెల్లిన బంగారం వెండి నగలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నేరస్తునిపై ఇప్పటికే 11 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. హత్య కేసును దర్యాప్తు చేసి ఎస్‌ఎచ్‌ఓ రవికుమార్, ఏరుగట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబల్ తిరపతి, కాన్స్టేబుల్ గంగా ప్రసాద్, ప్రసాద్, శీకాంత్ గౌడ్, రాజేశ్వర్‌లను ఏసిపి బసవ రెడ్డి ఆధ్వర్యంలో సిపి కల్మేశ్వర్ అభినందించి రివార్డులను అందజేశారు.

ఉపాధి కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా చూడాలి



గన్‌పూర్‌లో ఉపాధి హామీ కూలీల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో పీడీ



నడిపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్‌డీవో పీడీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18:డిచ్‌పల్లి మండలంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు ఇతర ప్రాంతాలకు కూలీ నిమిత్తం వెళ్లకుండా ఉన్నచోటే ఉపాధి పని కల్పించే విధంగా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గన్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ప్రస్తుత పరిస్థితుల్లో కావాల్సిన సదుపాయాలను కల్పించి పనులు చేసే కూలీలకు సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు లేని వారికి తక్షణమే అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీడీ ఓంపాల్, ఏపీవో సుధాకర్, నడిపల్లి సెక్రెటరీ కిషన్‌రావు, గన్‌పూర్ సెక్రెటరీ సునీల్‌కుమార్,ఉపాధిహామీ సీఏలు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోటగిరి,ఏప్రిల్18: కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ప్రతినిధులు రవి, హన్మంత్ రావులు తెలిపారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని చావిడి వద్ద వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వైద్యుల బృందం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. షుగర్ వ్యాధి, గుండె సంబంధమైన వ్యాధి, మానసిక వ్యాధి, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గల వారు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య పరీక్షలు నిర్వహించి స్క్రీన్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అవసరమైన మందులను పంపిణీ చేస్తారని ఈ అవకాశాన్ని వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు క్యాన్సర్ సంబంధమైన లక్షణాలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఖిల్లా డిచ్‌పల్లిలో వడదెబ్బతో వ్యక్తి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో జనాలు అల్లాడుతున్నారు. ఎండ తీవ్రత 30డిగ్రీల నుంచి 40 డిగ్రీల దాటి పోతుండంతో పశుపక్షాదులు మృతి చెందుతున్నాయి. అలాగే మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తూరు ఎల్లాగౌడ్ (74)మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఈనెల 16నఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.డిచ్‌పల్లి శివారులోగల గా యత్రీ ఎన్‌క్లేవ్ వద్ద వడదెబ్బతో గురువారం మృతి చెం దినట్లు ఎస్సై మ హేష్ తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వడదెబ్బతో వ్యక్తి మృతి ఎల్లాగౌడ్

రెండో రోజు సీఎంసీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు



డిచ్‌పల్లిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి శివారులోగల సీఎంసీ వైద్య కళాశాలలో గురువారం రెండవ రోజు కూడా మెదక్ దయాలసీస్ ఆ ధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రా మీణ ప్రజానీకానికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 250 మంది గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విమల్ సుఖుమార్, డాక్టర్ ప్రభుకిరణ్, డాక్టర్ సోల్‌మాన్, డాక్టర్ దయానంద్, శ్యామ్‌సన్, తదితరులు పాల్గొన్నారు.

పెగడాపల్లిలో మరిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



పెగడాపల్లిలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్18: బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో మరిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో హోమం, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మరిగమ్మ దేవి యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మరిగమ్మ విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయంలో గణపతి ఆరాధన, పుణ్యవచనం, హోమం, యజ్ఞం, ధాన్యాధివాసం, ఫల పుష్ప మొదలగు పూజలు నిర్వహించారు. శనివారం ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు రామయ్య, అబ్బయ్య, పోశెట్టి, భాను ప్రకాష్, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ బహిరంగ సభ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: నిజామాబాద్ ఓల్డ్ కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ బహిరంగ సభకు నేడు సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరవుతున్నారని ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు జగన్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ కూడా దాఖలు చేస్తారని జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఇద్దరికి గాయాలు

మోస్రా,ఏప్రిల్18: మోస్రా మండలంలోని గోవూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి వడ్ల కుప్పలను ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దకు వ్యక్తులకు గాయాలయ్యాయి. మోస్రాలో సీతారాముల పల్లకిసేవ కార్యక్రమం ముగించుకుని బాన్సువాడ వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి గమనించిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్లపై వడ్ల కుప్పలు వేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణ కుమార్ హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా శ్రీరాములవారి కల్యాణం

ఎడపల్లి, ఏప్రిల్ 18: ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ రామ మఠంలో గురువారం శ్రీ సీతా రాముల వారి కల్యాణ వేడుకలు శ్రీ రామ మఠ పీఠాదిపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామ మఠ పీఠాధిపతులు జయరామ్ మహారాజ్ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా నవమి రోజు జన్మదిన వేడుకలు నిర్వహించి, దశమి రోజు స్వాముల వారి కళ్యాణం నిర్మహించడం జరుగుతుందని, అదేవిధంగా నేడు కళ్యాణ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. స్వామి వారి కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలలో గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల సస్పెన్షన్

ఖిల్లా, ఏప్రిల్ 18: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన ఇద్దరు సీఐలను సస్పెన్షన్ చేస్తూ ఐజీ రంగనాథ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బోధన్ సీఐ ప్రేమ్ కుమార్ హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ కేసును పక్కదారి పట్టించారు. పంజగుట్ట సీఐ ప్రేమ్ కుమార్ ఒకే బ్యాచ్‌మేడ్ కావడంతో కేసును పక్కదారి పట్టించారు. దీనితో పంజాగుట్ట, బోధన్ సీఐలపై కేసులు నమోదుయ్యాయి. దీంతో బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ కేసులో డిపార్మెంట్ విచారణ పూర్తి కావడంతో ప్రేమ్ కుమార్‌ను సస్పెన్షన్ చేశారు. అలాగే నగరంలోని రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం దొంగతనం కేసులో మద్యం సేవించి విచారణకు వెళ్లిన సీసీఎస్ సీఐ రమేష్ పై విచారణ జరగడంతో పోలీసులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐజీ రంగనాథ్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేవారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఇద్దరు సీఐలను సస్పెండ్ చేసినట్లు పోలీస్ వర్గాలలో చర్చ జరుగుతుంది.


బీర్కూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈవో శ్రావణ్‌కుమార్

ధాన్యానికి తేమ పరీక్షలు

బీర్కూర్, ఏప్రిల్ 18: మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏఈవో శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయించేందుకు రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని తీసుకువచ్చారు. కొనుగోలు కేంద్రం ఆవరణలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ఏఈవో శ్రావణ్‌కుమార్ ధాన్యం కుప్పల దగ్గరకు వెళ్లి వరి ధాన్యానికి ప్రత్యేక యంత్రంతో తేమ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని బాగా ఆరబెట్టుకోవాలన్నారు. 17శాతం లోపు తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారని చెప్పారు. ధాన్యం తాలు, మట్టి పెళ్లలు, రాళ్లు, చెత్తా లేకుండా ధాన్యాన్ని శుభ్రం చేసుకోవాలని సూచించారు.

పాదయాత్ర స్వాములకు పండ్ల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 18: మండలం నుంచి జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు పాదయాత్ర వెళుతున్న స్వాములకు గురువారం జుక్కల్ మండల కేంద్రానికి చెందిన భక్తులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష అంటేనే కఠినమైనదని, దీక్షలో ఉండి జుక్కల్ నుంచి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లడం ఎంతో గొప్పతనమని తెలిపారు. స్వాములకు పండ్లు, మంచినీరు సరఫరా చేశారు. అనంతరం స్వాములు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సుమారు 30 కిలో మీటర్ల చొప్పున పాదయాత్ర చేసి వారం రోజులలో కొండగట్టుకు చేరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అస్పత్‌వార్ అరుణ్, సాయికిరణ్, వాగ్మరే లక్ష్మణ్, సజ్జన్‌వార్ సాయి, గాయక్వాడ్ విఠల్, జ్ఞానేశ్వర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ సాయినాథ్ తెలిపారు. నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులకు సంస్థాపరంగా ఏమైనా సమస్యలుంటే ఈ సమావేశానికి హాజరై సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మద్నూర్ సర్వసభ్య సమావేశం వాయిదా

మద్నూర్, ఏప్రిల్ 18: మద్నూర్ మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ఎంపీటీసీల కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేశామన్నారు. సమావేశానికి ఎంపీపీ లక్ష్మీబాయి, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు పలువురు లేకపోవడంతో వాయిదా పడింది.

28వ వార్డు బీఆర్ఎస్ కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 18: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు బీఆర్ఎస్ కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా జునైద్ ఉద్దీన్, జనరల్ సెక్రెటరీగా షాయజ్, ప్రచార కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా ఖలీల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రవీణను, కార్యవర్గ సభ్యులుగా ఖజాపాషా, సాయిగౌడ్ షబీర్, హయన్, అదాన్, జూహిద్, రాజు, బాబు, లక్ష్మణ్, మహిళ అధ్యక్షురాలిగా సుమలతను, వైస్ ప్రెసిడెంట్‌గా రాధలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'

గాంధారి, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గడపగడపకూ ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచించిన ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, లైన్ రమేష్, బాలయ్య, రవి, ఈశ్వర్‌గౌడ్, భాగ్యనాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ప్రాజెక్ట్ సమన్వయ కర్త డాక్టర్ భగీష్ మిశ్రా

1962 వాహనాల తనిఖీ

సదాశివనగర్, ఏప్రిల్ 18: పశు సంచార అంబులెన్స్‌ల ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ భగీష్ మిశ్రా సదాశివనగర్‌లో 1962 వాహనాలను గురువారం తనిఖీ చేశారు. వైద్యసేవల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి, మూగజీవాలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనాల్లోని పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఎం రవి, ఈఎంఈ లింగాచారి, సిబ్బంది పైలెట్ గంగాధర్, పారావెట్ రమ్యాహెల్పర్ సుధాకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


దుర్కిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దుర్కిలో బీజేపీ ప్రచారం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నసురుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సాయిలు, మండల బీజేపీ నాయకులు సంజీవ్, అధ్యక్షులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు


కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీకాంత్ రావు, సురేష్ షెట్కార్

పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్
- ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే కాంగ్రెస్‌కే ఓటు వేయండి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

నిజాంసాగర్, ఏప్రిల్ 18: పార్టీ కోసం కష్టపడేవారికే సముచిత స్థానం ఉంటుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. గురువారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని మహ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. పదేళ్ల ఎంపీగా పనిచేసి ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదన్నారు. కేంద్రంలో కూడా అధికారంలో రాబోతుందని, ప్రధాన మంత్రిగా రాహుల్ గాంధీ అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన 3 నెలల్లోనే రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు, సెంట్రల్ లైటింగ్, ఆస్పత్రుల్లో ఆధునాతన వైద్య పరికరాలు ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ వెళుతున్నామన్నారు. గత ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యకర్తలందరూ చాలా సంతోషంగా ఉన్నారని, అసెంబ్లీ ఎలక్షన్స్ కంటే రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. షరాఫ్ రామాగౌడ్, తదితరులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నాయకులు కాసుల బాల్‌రాజ్, ప్రదీప్, లక్ష్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మల్లికార్జున్, నాయకులు సవాయి సింగ్, కృష్ణారెడ్డి, మనోజ్ కుమార్, తదితరులున్నారు.

భిక్కనూరులో కొనసాగుతున్న పెద్దమ్మ జాతర

భిక్కనూరు, ఏప్రిల్ 18: భిక్కనూరు మండల కేంద్రంలోని వనదుర్గా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం, జాతర కార్యక్రమాలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. జాతరలో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని ముదిరాజ్ సంఘ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం గ్రామదేవతలకు బోనాలు, మహాపూజ, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


భిక్కనూరులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ కాదు.. బిజినెస్ పాటిల్

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 18: బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ కాదని బిజినెస్ పాటిల్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలలో ఎంపీగా బీబీ పాటిల్ చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. మూడేండ్ల కిందట కొందరు మీడియా ప్రతినిధులు బీజేపీలోకి బీబీపాటిల్ వెళ్తున్నాడని రాస్తే వారికి లీగల్ నోటీసులు పంపించి ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తి ఇప్పుడు ఏ విధంగా బీజేపీలో చేరాడో చెప్పాలని అన్నారు. బీబీ పాటిల్ ప్రజాసేవకోసం పోటీచేయడం లేదని కేవలం తన బిజినెస్‌లను కాపాడుకునేందుకు ఎంపీగా పోటీచేస్తున్నాడని అన్నారు. 10 ఏళ్లుగా యువత, రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని అన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేయకపోవడంతో ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని అనేకమంది యువకులు హైదరాబాద్‌లో స్విగ్గి, జొమాటోలు పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎంపీగా బీబీ పాటిల్ ఒక్కరూపాయి కూడా ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ఖర్చుపెట్టిన దాఖాలలు లేవని అన్నారు. గతంలో కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌లో తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కాపాడుకునేందుకు రైతులు పోరాటం చేస్తున్న వారికి మద్దతుగా ఏనాడు పనిచేయలేదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తానే రైతుల పక్షాన పోరాటంలో పాల్గొని వారికి మద్దతుగా నిలిచానని రైతులు ఈ విషయాన్ని గమనించి బీబీ పాటిల్ అభ్యర్థిత్వంపై ఒక్కసారి ఆలోచన చేయాలని అన్నారు. బీబీ పాటిల్ ముమ్మాటికి బిజినెస్ పాటిల్ అని కేవలం బిజినెస్ కోసం ఎంపీగా పోటీచేస్తున్నాడే తప్ప ప్రజలశ్రేయస్సుకు ఏనాడు కృషి చేయలేదని ఆయన నిర్లక్ష్య వైఖరీ వల్ల రూ.50 కోట్ల నిధులు ఇప్పటికే వెనక్కి మళ్లి వెళ్లాయని అన్నారు. ప్రజల కోసం ప్రతినిత్యం ఆలోచన చేసే కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు


శెట్పల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

అకాల వర్షంతో రైతులకు కష్టం

లింగంపేట, ఏప్రిల్ 18: మండలంలోని శెట్పల్లి, పర్మల్ల, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాలలో గురువారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతుల ధాన్యం తడవకుండా అష్ట కష్టాలు పడుతున్నారు. ఈ సంవత్సరం రబీలో వర్షా భావ పరిస్థితులతో వేసిన పంటలు సగం ఎండి పోగా మిగిలిన పంటనైన అమ్ముకుందామంటే రైతులకు వరుణ దేవుడు కష్టాలను చూపుతున్నాడు. చేతికి వచ్చిందన్న సంతోషాన్ని మిగలకుండా వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఆరిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి పరామర్శ


నాగరాజును పరామర్శిస్తున్న షబ్బీర్ అలీ

భిక్కనూరు, ఏప్రిల్ 18: భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గజవాడ నాగరాజును ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ గురువారం పరామర్శించారు. నాగరాజు తల్లి నాగలక్ష్మీ ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న షబ్బీర్‌అలీ పరామర్శించి నాగలక్ష్మీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తల్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని నాగరాజును ఆయన ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీంరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, గాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుంట లింగారెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డులో రైతులు కుప్పగా పోసిన వడ్లు

మార్కెట్ యార్డులో వెలగని విద్యుత్ దీపాలు

బిచ్కుంద, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండువారాలుగా విద్యుత్ దీపాలు వెలుగక చీకట్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు వారాలుగా రైతులు పండించిన వరిధాన్యం కోతలు చేపట్టి వడ్లు ఆరబెట్టుకునేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలిస్తున్నారు. పదిరోజుల నుండి వాతావరణంలో మార్పులు ఏర్పడుతూ ఆరబెట్టిన వడ్ల వద్దనే రైతులు పడికాపులు కాస్తున్నారు.రాత్రి వేళ మార్కెట్ యార్డులో విద్యుత్ సౌకర్యం లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శికి విద్యుత్ దీపాలు వెలుగడం లేదని వివరించిన ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మురికి కాలువలో పసికందు మృతదేహం

లింగంపేట, ఏప్రిల్ 18: మండలంలోని ఐలాపూర్‌లో గురువారం మురికి కాలువలో పసికందు (బాలుడు) మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కోసం కామారెడ్డికి తరలించారు. పసి కందు నెలలు నిండకుండానే అబార్షన్ చేశారా లేక ఎం జరిగిందనేది పోలీసులు విచారణ జరుపుతున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డను మురికి కాలువలో పారవేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు మనుషుల్లో మానవత్వం నశించిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటకు బాధ్యులైన వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి శవం గురువారం లభ్యమైందని పట్టణ సీఐచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుని వయస్సు దాదాపు 30 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. తెలుపురంగుతో అతనియొక్క ఎడమచేతిపై హార్ట్ సింబల్ ఉండి ఒకవైపు ఎస్, ఒకవైపు ఆర్ లెటర్స్‌కలవని తెలిపారు. మృతుని ఎవరైన గుర్తిస్తే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిలో ఉందని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

భిక్కనూరు, ఏప్రిల్ 18: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సమన్వయ కమిటీ చైర్మన్ తక్కళ్ల బాపురెడ్డి, సిద్దరామేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ మామిడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కండడి బాల్‌రెడ్డితో సహ పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు


మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవ పూజలో పాల్గొన్న ప్రతినిధులు

తాడ్వాయి, ఏప్రిల్ 18: తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి మార్కండేయ ఆలయ ఆవరణలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పద్మశాలి సంఘ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు


నాచుపల్లిలో కుస్తీ పోటీలో పాల్గొన్న మల్ల యోధులు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని నాచుపల్లి గ్రామ శివారులోని శ్రీరామ నవమి సందర్భంగా రెండవ రోజు రాములగుట్ట తండా, శ్రీరామాలయం సమీపంలోని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలకు, చుట్టూ పక్కల మండలాల నుంచి కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కుస్తీ పోటీలో పాల్గొనేందుకు మల్ల యోధులు తరలివచ్చారు. కుస్తీ పోటీలో విజేతలుగా నిలిచిన వారికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గారమ పెద్దలు, యువకులు, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో ఈ కుస్తీ పోటీలో పాల్గొన్నారు.

జిల్లాలో మండుతున్న సూరీడు

- దోమకొండలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 18: జిల్లాలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. జిల్లాలోని దోమకొండలో 43.1 డిగ్రీలు, బిచ్కుందలో 42.6 ఎల్పుగొండలో 42.3, పిట్లం 42.0, భిక్కనూర్ 41.9, డొంగ్లి 41.7, కామారెడ్డి పట్టణంలోని పాతరాజంపేట 41.4, భిక్కనూర్ 42.2, గాంధారి 41.4 లింగంపేట 41.4, బీర్కూర్ 41.4, బోమన్ దేవాయిపల్లి 41.4, రామారెడ్డి 41.4, బీబీపేట 41.3, మద్నూర్ మండలం మేనూర్ 41.1, పెద్దకొడప్‌గల్ 40.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మద్నూర్ సబ్ సెంటర్‌ను సందర్శించిన వైద్యురాలు

మద్నూర్, ఏప్రిల్ 18: మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని సబ్‌సెంటర్ల పనితీరును డోంగ్లీ వైద్యురాలు శ్రీలేఖ వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. గురువారం మద్నూర్ సబ్ సెంటర్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు సేవ చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బ గురించి అవగాహన కల్పించాలన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీ పరిధిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు అందజేయాలన్నారు. సూపర్‌వైజర్ రవి, వైద్యులు బస్వరాజ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ పాఠశాలలో కంటి పరీక్ష శిబిరం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 18: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థిని పరీక్షించి, కంటి సంరక్షణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. 131 మంది విద్యార్థులకు పరీక్షించగా నలుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ సుధాకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ ఎస్.సంగీతలతో పాటు వైద్య సిబ్బంది హరికిషన్‌రావు, రవితేజ, సునీత, ఇందిరా, ఆశా వర్కర్లు సంధ్య, సవిత పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మనజుమిల్ బాయ్స్
శాంతి - టిల్ స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర - లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

